క్లుప్తంగా

చెట్టుపై మంటలు.. విద్యుత్ అంతరాయం



డోర్నకల్: స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ పక్కన భారీ వృక్షానికి నిప్పంటుకుని మంటలు చెలరేగడంతో గురువారం పట్టణంలో నాలుగు గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. సబ్ స్టేషన్ పక్కన వ్యవసాయ భూముల్లో నిప్పంటుకుని గడ్డి కాలింది. గాలికి మంటలు సబ్ స్టేషన్ పక్కనే ఉన్న చెట్లకు తాకాయి.. దీంతో భారీగా మంటలు చెలరేగడంతో విద్యుత్ సిబ్బంది మంటలు చెలరేగుతున్న చెట్ల పక్కన బంజర, డోర్నకల్ ఫీడర్లకు చెందిన విద్యుత్ వైర్లను స్థంభాల పైనుంచి తొలగించారు. విద్యుత్ శాఖ ఏఈ కిరణ్, ఎల్ఎం రవి, మున్సిపల్ చైర్మన్ వీరన్న, మహబూబాబాద్ మార్కెట్ చైర్మన్ విద్యాసాగర్, కౌన్సిలర్ బసిక అశోక్ తదితరులు ఘటనాస్థలం నుంచి ఫైరింజన్‌కు సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది మంటలను అదుపుచేయడంతో ప్రమాదం తప్పింది.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



కేసముద్రం: అంగన్‌వాడీ ఉద్యోగులకు కనీస వేతనం అందించాలంటూ నేడు ఆదిలాబాద్‌లో ప్రారంభం కానున్న రాష్ట్ర జీపుజాత వాల్ పోస్టర్లను గురువారం కేసముద్రంవిలేజ్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి జల్లె జయరాజ్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్టు అధ్యక్షురాలు మంగమ్మ, వెంకటరమణ, లలిత, భారతి పాల్గొన్నారు.

భూమిపూజ

కేసముద్రం: మండల కేంద్రంలోని ముత్యాలమ్మగుడిలో వార్డుసభ్యుడు నర్సింగం వెంకటేశ్వర్లు తన చెల్లెలు రేవతి జ్ఞాపకార్థం నిర్మించే మినీట్యాంక్ కు సర్పంచ్ బట్టు శ్రీనివాస్ గురువారం భూమిపూజ చేశారు. ఉపసర్పంచ్ ముత్యాల నాగమణి, శివకుమార్, వార్డుసభ్యులు పద్మ, బాలునాయక్, వెంకన్న, సుధాకర్, మురళి, అశోక్, రమేష్ పాల్గొన్నారు.

నేడు గడప గడపకూ సీతక్క కార్యక్రమం

గంగారం : మండలంలో నేడు గడప గడపకు సీతక్క కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మండల అధ్యక్షుడు జాడి వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. స్థానిక జెడ్పీటీసీ, ఎంపీపీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా ప్రతినిధులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

రేపు సీపీఎం బహిరంగ సభ

మహబూబాబాద్ రూరల్: ఇండ్ల పట్టాలు, డబుల్‌బెడ్రూం ఇళ్ల పంపిణీపై జిల్లా కేంద్రంలో ఈ నెల 18వ తేదీ శనివారం భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్న ట్లు సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు గునిగంటి రాజన్న అన్నారు. మహబూబాబాద్ మండలంలోని మల్యాల గ్రామంలో సీపీఎం జనరల్ బాడీ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజన్న మాట్లాడారు. ప్రజలు బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి దుడ్డెల రాంమ్మూర్తి, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

చేపల చెరువు లూటీ



చెరువులో చేపలు పడుతున్న జనం

కురవి: సీరోలు మండలం ఉప్పరిగూడెంలో మామిండ్ల చెరువును చుట్టు పక్కల గ్రామాలకు చెందిన జనం గురువారం లూటీ చేశారు. ఉప్పరిగూడెం చుట్టు పక్కల గ్రామాలకు చెందిన జనం చేపలను బస్తాల్లో ఎత్తుకెళ్లారు. గ్రామానికి చెందిన ముదిరాజ్ కులస్తుడు కొప్పెర రామన్న లూటీకి వచ్చిన వారితో వాగ్వాదానికి దిగినా లాభం లేకుండా పోయింది. చెరువులో చేపులన్నాయని, ఎంత చెప్పినా వినకుండా చెరువులోకి దిగి చేపలన్నింటిని పట్టుకుని వెళ్లిపోయారని తెలిపారు. విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు రామన్న తెలిపారు.



చేపలను బస్తాల్లో తీసుకొస్తున్న వ్యక్తులు



మహబూబాబాద్ రూరల్: జంగిలిగొండలో..



గూడూరులో..



నెల్లికుదురు: ముగ్గులు వేస్తున్న యువతులు

దేశానికే ఆదర్శం తెలంగాణ

తెలంగాణ రాష్ట్రం, సీఎం కేసీఆర్ పాలన దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని మహబూబాబాద్ ఎమ్మెల్యే శంకర్ నాయక్ అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన పల్లె ప్రగతి కార్యక్రమాల్లో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామపంచాయతీల ఎదుట జాతీయ జెండాను ఆవిష్కరించారు.

– సాక్షి నెట్‌వర్క్



మహబూబాబాద్ రూరల్: ఎమ్మెల్యే శంకర్‌నాయక్‌కు స్వాగతం పలుకుతున్న ప్రజలు, ప్రజాప్రతినిధులు



కురవి: చీమ్లా తండాలో..



గార్లలో..



కేసముద్రం: అర్పనపల్లిలో..



దంతాలపల్లి: పెద్దముప్పారం గ్రామంలో..



చిన్నగూడూరులో..



పెద్దవంగర: బొమ్మకల్లులో..



తొర్రూరు రూరల్: సోమారపుకుంట తండాలో..

పేదలందరికీ ఇళ్ల పట్టాలు ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న సాదుల శ్రీనివాస్

నెహ్రూసెంటర్: రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకున్నవారందరికీ 58 జీఓ ద్వారా రెగ్యులరైజ్ చేసి పట్టాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గుడిసెలు వేసుకున్న పేదలపై అధికారులు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ కార్యాలయాల పేర పేద ప్రజలను భూముల నుంచి వెళ్లగొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భూ కబ్జాదారులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్రభుత్వ భూములను ఆక్రమించుకుంటున్నారని వారికి ప్రజాప్రతినిధులు అండగా ఉంటున్నారని ఆరోపించారు. ప్రజా సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీన మహబూబాబాద్‌లో బస్సుయాత్ర ప్రారంభం, భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. సమావేశంలో సూర్నపు సోమయ్య, గునిగంటి రాజన్న, ఆకుల రాజు, సమ్మెట రాజమౌళి పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే లైసెన్స్ రద్దు

గార్ల: డీలర్లు నకిలీ విత్తనాలు విక్రయిస్తే, సదరు దుకాణం లైసెన్స్ రద్దు చేస్తామని మండల వ్యవసాయ అధికారి కావటి రామారావు హెచ్చరించారు. గురువారం గార్లలోని పలు విత్తన దుకాణాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి స్టాక్ రిజస్టర్, విత్తనాల రశీదు బుక్స్‌ను పరిశీలించారు. దుకాణాల్లో విత్తనాలు తీసుకున్న ప్రతీ రైతు విధిగా రశీదు పొందాలని సూచించారు. ప్రభుత్వం ఆమోదం తెలిపిన బ్రాండెడ్ కంపెనీల విత్తనాలు మాత్రమే విక్రయించాలని సూచించారు. లైసెన్స్ కలిగిన డీలర్ల వద్దనే రైతులు విత్తనాలు కొనుగోలు చేయాలని తెలిపారు.



విత్తన దుకాణంలో తనిఖీ చేస్తున్న రామారావు

గడువు తేదీ దాటిన విత్తనాలను విక్రయిస్తే డీలర్‌పై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రక్తదానం పునర్జన్మనిస్తుంది..



సర్టిఫికెట్ అందజేస్తున్న ఎస్పీ

పెద్దవంగర: రక్తదానం ఆపదలో ఉన్న వారికి పునర్జన్మనిస్తుందని ఎస్సై రాజు అన్నారు. తొర్రూరు పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో గురువారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఎస్సై రాజు, పోలీస్ సిబ్బందితో పాటు 25 మంది యువకులు రక్తదానం చేశారు. అనంతరం రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంక్ సర్టిఫికెట్‌ను ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఎస్సై రాజుకు అందజేసి అభినందించారు.

మానుకోట అభివృద్ధికి కృషి



పనులకు శంకుస్థాపన చేస్తున్న రవీందర్‌రావు

మహబూబాబాద్: మానుకోట మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు అన్నారు. మానుకోట మున్సిపల్ పరిధిలోని నున్నా నారాయణ నగర్ కాలనీలో ఎమ్మెల్సీ నిధులు రూ.5లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు గురువారం ఆయన శంకుస్థాపన చేసి, మాట్లాడారు. మానుకోట మున్సిపాలిటీలో వందల కోట్లతో అభివృద్ధి పనులు జరిగి మానుకోట రూపు రేఖలు మారాయన్నారు. సీఎం కేసీఆర్ మానుకోట మున్సిపాలిటీ రూ.50 కోట్లు మంజూరు చేశారని వాటితో మానుకోట మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. సీపీఎం మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సూర్నపు సోమయ్య, కన్న, జెర్రిపోతుల వెంకన్న, వేణు, రమేష్, హరిసింగ్, మహేందర్, వెంకన్న పాల్గొన్నారు.

భూకబ్జాదారులకు ప్రభుత్వ అండ..

● పెరుమాండ్ల తిలక్ బాబు

నెల్లికుదురు: నిరుపేద ప్రజల కడుపు కొట్టి భూకబ్జాదారులకు కేసీఆర్ ప్రభుత్వం అండగా నిలుస్తుందని సీపీఎం మండల కార్యదర్శి పెరుమాండ్ల తిలక్ బాబు ఆరోపించారు. మండలంలోని మునిగలవీడు గ్రామ శివారు పంతులు తండా, బంజర గ్రామంలో గురువారం జరిగిన జనరల్‌బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. బడాబాబులు ప్రభుత్వ భూములను ఆక్రమిస్తున్నా ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోకుండా పేదప్రజలపై జులుం చూపెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశా రు. ఈ మేరకు ఈ నెల 18న మహబూబాబాద్ పట్టణంలో నిర్వహించే సీపీఎం భారీ బహిరంగ సభకు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. నాయకులు సైదులు, మంగ్య, లాల్య, రమేష్, వెంకన్న, ఉపేందర్, శంకర్ పాల్గొన్నారు.

క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం

మహబూబాబాద్ అర్బన్: క్రీడలు ఆరోగ్యానికి మేలు చేస్తాయని మున్సిపల్ కమిషనర్ ప్రసన్న రాణి, పట్టణ సీఐ సతీష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని 36వ వార్డు పరిధిలో 40 రోజులపాటు జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మర్ కోచింగ్ క్యాంపు ముగింపు కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చిన్నారులు, యువకులు చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ.. క్రీడల్లో రాణిస్తూ మంచి భవిష్యత్ పొందాలన్నారు. చదువుతోపాటు క్రీడలపై ఆసక్తి పెంచుకుంటూ క్రమశిక్షణగా మెలగాలన్నారు. సెల్‌ఫోన్ వినియోగం తగ్గించుకోవాలని, పుస్తకాలు చదివి జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. సీపీఐ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ అజయ్‌సారధిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మెతుకు కుమార్, 36వ వార్డు కౌన్సిలర్ నీరజరెడ్డిధర్మన్న, నీలం వెంకటేశ్వర్లు, దాసరి ప్రసాద్, చరిత్‌రెడ్డి, ముజాహిద్, అనిల్ పాల్గొన్నారు.

సన్మార్గంలో పయనించేందుకు క్రీడలు దోహదం

గార్ల: యువకులు చెడు వ్యసనాలను వీడి సన్మార్గంలో పయనించేందుకు క్రీడలు దోహదపడతాయని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి గోపాల్ రెడ్డి అన్నారు. మాజీ మంత్రి రాంరెడ్డి వెంకట్‌రెడ్డి జ్ఞాపకార్థం మండలంలోని ముల్కనూరు పంచాయతీలో నిర్వహించిన గార్ల, బయ్యారం మండలాల స్థాయి క్రికెట్ పోటీల బహుమతి ప్రధానోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు.



మహబూబాబాద్ అర్బన్: క్రీడాకారులతో మున్సిపల్ కమిషనర్, సీఐ

క్రికెట్ పోటీల్లో చిన్నకిష్టాపురం జట్టు ప్రథమస్థానం, గుంపెళ్లగూడెం ద్వితీయస్థానం, బయ్యారం తృతీయస్థానం, సీతంపేట జట్టు నాల్గవ స్థానం దక్కించుకున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చంద్రారెడ్డి, నాయకులు రాంరెడ్డి శ్రీచరణ్‌రెడ్డి, రామచంద్రునాయక్, నాగమణి, రామారావు, వెంకట్‌రెడ్డి, సర్పంచ్ రాందాస్, సాగర్‌బాబు, చిలుకబాబు, వెంకటప్రవీణ్‌నాయక్, జనార్ధన్, రాజు, వెంకట్రావ్, నితిన్, కుమార్ పాల్గొన్నారు.

కవులు, రచయితలు ప్రజల కోసం పనిచేయాలి

మహబూబాబాద్: కవులు, రచయితలు ప్రజల హక్కుల కోసం ప్రజల హితం కోసం పని చేయాలని శుభోదయం సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ అధ్యక్షుడు సంకెపల్లి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. స్థానిక బ్యాంక్ కాలనీలోని సంస్థ కార్యాలయంలో గురువారం నిర్వహించిన శ్రీశ్రీ వర్థంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మహాకవి శ్రీశ్రీ పీడిత, తాడిత, బలహీన వర్గాల సమస్యల పరిష్కారానికి కవిత్వం ద్వారా కృషి చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో లక్ష్మీకాంతరావు, పాపయ్య, అజీజ్‌ఖాన్, గణేష్, వీరస్వామి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



శ్రీశ్రీ కి నివాళులర్పిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

పేదలకు వైద్యం అందించడంలో నిర్లక్ష్యం



మాట్లాడుతున్న మహేందర్‌రెడ్డి

కేసముద్రం: రాష్ట్ర ప్రభుత్వం పేదలకు వైద్యం అందించడంలో నిర్లక్ష్యం వహిస్తుందని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి విమర్శించాడు. గురువారం మండల కేంద్రంలో జరిగిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ హయంలో రాజీవ్ ఆరోగ్య శ్రీ కింద పేదలకు అన్ని రకాల వ్యాధులకు వైద్యం అందేదని గుర్తు చేశారు. కాని ఇప్పుడున్న బీఆర్ఎస్ ప్రభుత్వం మాత్రం రాజీవ్ ఆరోగ్ర శ్రీ పథకం కింద వచ్చే వ్యాధులకు చికిత్సను తగ్గించడమే కాకుండా, వైద్యం చేసిన హస్పిటల్స్‌కు బిల్లులు చెల్లించడంలేదన్నారు. కేసముద్రంలో 30 పడకల ఆస్పత్రిని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి మరిచారన్నారు. ఎంపీటీసీ దారావత్ బాలునాయక్, పోలెపాక నాగరాజు, ఎండి.అయూబ్‌ఖాన్, బాలునాయక్, సత్యానందం, క్లెం శ్రీనివాస్‌రెడ్డి, చిట్ల సంపత్, తాజుదిన్, గుండు గోపాల్ పాల్గొన్నారు.

జాతీయ జెండాకు అవమానం



మహబూబాబాద్ కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన భారీ జాతీయ జెండా బుధవారం రాత్రి వీచిన గాలికి చిరిగిపోయి దర్శనమిస్తోంది. గురువారం సాయంత్రం వరకు అధికారులు జెండాను తొలగించలేదు.

–సాక్షి, స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, మహబూబాబాద్

కాంగ్రెస్ పార్టీతోనే ప్రజలకు న్యాయం

మహబూబాబాద్ రూరల్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే పేద, మధ్య తరగతి కుటుంబాల ప్రజలకు న్యాయం జరుగుతుందని టీపీసీసీ ఆదివాసీ చైర్మన్ తేజావత్ బెల్లయ్యనాయక్ అన్నారు. రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీలు ప్రకటించిన రైతు, యూత్ డిక్లరేషన్ కరపత్రాల పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంలోని బెల్లయ్యనాయక్ క్యాంపు కార్యాలయలలో గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ప్రజలకు జరిగే మేలును వారికి తెలియజేయాలన్నారు. జిన్నారెడ్డి వెంకటేశ్వర్లు, ముల్లంగి ప్రతాప్‌రెడ్డి, గుగులోత్ వెంకటి, వెంకటస్వామి, సీతారాములు, యాకుబ్, శంకర్, రాంచంద్రు, బుచ్చిరాములు, ముత్తయ్య, రంగయ్య, నరేష్, ఉప్పలయ్య పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం

గూడూరు: ప్రజా సంక్షేమ పథకాలతో కాంగ్రెస్ పార్టీ పేదలకు అండగా నిలిచిందని నియోజకవర్గ నాయకుడు డాక్టర్ మురళీనాయక్ అన్నారు. మండలంలోని గుండెంగ, శివారు హనుమాన్‌తండా, దొడ్డితండాల్లో ఉపాధి కూలీలతో మాట్లాడి సమస్యలను తెల్సుకున్నారు. నాడు కాంగ్రెస్ ప్రభుత్వమే ఉపాధి హామీ పథకాన్ని తీసుకొచ్చిందని గుర్తి చేశారు. ఏది ఏమైనా రాష్ట్ర సాధన పేరుతో అధికారం చేపట్టిన సీఎం కేసీఆర్ బీఆర్ఎస్ పాలనకు రాబోయే ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెప్పాలని కోరారు. కార్యక్రమంలో అర్రెం వీరస్వామి, శంకర్‌గౌడ్, మహేందర్, వీరన్న, శివ, ముత్యం లక్ష్మీనారాయణ, వీరన్న, ఈర్యా, కిషన్, రవిచందు, హేమలత పాల్గొన్నారు.



డిక్లరేషన్ పత్రాలను అందజేస్తున్న బెల్లయ్యనాయక్

క్రైమ్ కార్నర్

వ్యక్తిపై కేసు నమోదు

దంతాలపల్లి: ఒకరిపై మరొకరు దాడి చేయడంతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు గురువారం వెల్లడించారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బీరిశెట్టిగూడం గ్రామానికి చెందిన గండి సాయి అదే గ్రామానికి చెందిన మారగాని సోమయ్య ఇంటిపై రాళ్లతో దాడిచేస్తుండగా.. సోమయ్య తమ్ముడు మురళి మా అన్న ఇంటిపై దాడి ఎందుకు దాడి చేస్తున్నావని ప్రశ్నించాడు. దీంతో మురళిని బూతులు తిడుతూ.. రాయితో సాయి గాయపరిచాడు. ఈనేపథ్యంలో మురళి ఇచ్చిన ఫిర్యాదు మేరకు గండి సాయిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కూచిపూడి జగదీష్ తెలిపారు.

రేషన్ బియ్యం స్వాధీనం

గార్ల: మండలంలోని బుద్దారం రైల్వేగేటు వద్ద అక్రమంగా ఆటోలో గార్లకు తరలిస్తున్న 7 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకొని, ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై బానోత్ వెంకన్న గురువారం తెలిపారు. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలానికి చెందిన సయ్యద్ జీనా బుద్దారం పంచాయతీలోని పలు గ్రామాల్లో రేషన్ బియ్యం కొనుగోలు చేసి ట్రైన్‌లో ఎర్రుపాలెం తరలించేందుకు ఆటోలో గార్లకు తీసుకొస్తున్నాడు. పక్కా సమాచారం మేరకు పోలీసులు బుద్దారం రైల్వేగేటు సమీపంలో రేషన్‌బియ్యాన్ని స్వాధీనం చేసుకుని ఆటోను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈమేరకు సయ్యద్ జీనా, గార్ల మండలం అంజనాపురం గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ మూడు కృష్ణపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం

గంగారం : మండలంలోని తిరుమలగండి గ్రామ శివారులో గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై ఉపేందర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో ఐదురోజుల క్రితం భిక్షాటన చేస్తూ కనిపించిన ఓ మహిళ గురువారం ఉదయం కట్టెలకు వెళ్లిన గ్రామస్తులకు శవమై కనిపించినట్లు తెలిపారు. మృతదేహం గుర్తుపట్టేందుకు వీలు లేకుండా కుళ్లిపోయి ఉండడంతో, అక్కడే పోస్టుమార్టం నిర్వహించి కననం చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రం శివారు తాళ్లపూసపల్లిరోడ్డులోగల పాలకేంద్రం వద్ద గురువారం రాత్రి ద్విచక్రవాహనాన్ని, కారు ఢీ కొట్టడంతో ఓ మహిళ మృతిచెందింది. రూరల్ పోలీసులు, బాధితులు తెలిపిన ప్రకారం.. కేసముద్రం మండలంలోని ధర్మారంతండాజీపీ శివారు వెంక్యాతండాకు చెందిన కున్‌సోత్ మోహన్, సరోజ(30) ద్విచక్రవాహనంపై మహబూబాబాద్ వైపునకు వెళ్తన్నారు. ఈ క్రమంలో మానుకోట శివారులోని పాలకేంద్రం స మీపంలో వెనక నుంచి వచ్చిన కారు బైక్‌ను ఢీ కొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడ్డ సరోజన ను వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది.

పారిశుద్ధ్య కార్మికురాలికి రాష్ట్రస్థాయి అవార్డు



కేసముద్రం: ఇనుగుర్తి గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికురాలు గుజ్జునూరి యాకమ్మ జిల్లా నుంచి రాష్ట్రస్థాయి ఉత్తమ పారిశుద్ధ్య కార్మికురాలిగా ఎంపికైంది. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో ఆమె అవార్డు అందుకుంది.

జోడు మేకపోతుల బండితో మొక్కులు

నెల్లికుదురు: చిన్ననాగారంలో ముత్యాలమ్మతల్లికి ఇనుగుర్తి మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాలకు చెందిన యాదవులు బోనాల పండుగ బుధవారం రాత్రి అంగరంగ వైభోగంగా నిర్వహించారు. ఇనుగుర్తికి చెందిన భక్తులు కొమ్మనబోయిన మహేందర్ యాదవ్‌తో పాటు మరికొందరు జోడు మేకపోతులతో బండి కట్టి ముత్యాలమ్మతల్లి ఆలయం వరకు తీసుకొచ్చి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.



జోడు మేకపోతుల బండితో భక్తులు

ఉచిత బస్‌పాస్‌ల పంపిణీ

దంతాలపల్లి: మండలకేంద్రంలోని జిల్లా ప్రజాపరిషత్ సెకండరీ పాఠశాలలో గురువారం 150 మంది విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, నోడల్ అధికారి శ్రీనువాస్ ఉచితంగా బస్‌పాస్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో చదువుతున్న 6నుంచి 10వ తరగతి విద్యార్థినులకు, 6,7తరగతుల విద్యార్థులకు పంపిణీ చేశామని తెలిపారు. ఆర్టీసీ గ్రామాల అధికారి తండ లక్ష్మయ్య మాట్లాడుతూ.. విద్యార్థుల చదువు కోసం ఆర్టీసీ ఇచ్చే కానుక బస్‌పాస్ అని తెలిపారు. కార్యక్రమంలో బస్సుపాసుల ఇంచార్జి సురేందర్‌గుప్తా, ఉపాధ్యాయ కార్యదర్శి హర్షవర్ధన్‌రెడ్డి, యాకుబ్‌అలీ, కుమారస్వామి, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.



పాసులు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు